RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

వరంగల్
సంపుటి: 4 సంచిక:106

శనివారం
ఏప్రిల్ 11, 2026

పేజీలు 8
వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

దినపత్రిక



## మావోయిస్టుల భారీ లొంగుబాటు

- డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 42 మంది జనజీవన స్రవంతిలోకి
- పీఎల్‌జీఏ బెటాలియన్ కమాండర్ సోడి మల్ల సహా కీలక నేతల సరెండర్
- భారీగా ఆయుధాలు, 800 గ్రాముల బంగారం పోలీసులకు అప్పగింత
- కోటీ 93 లక్షల రివార్డు ప్రకటించిన ప్రభుత్వం
- పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి భారీ దెబ్బ

2లో



# పొంగులేటి వర్సెస్ తన్నీరు!!

## రాష్ట్ర రాజకీయాల్లో సెగలు పుట్టిస్తున్న అవినీతి సమరం! | అగ్రనేతల మధ్య పేలుతున్న మాటల తూటాలు

### రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై రాజుకున్న రగడ

- తారస్థాయికి చేరిన మంత్రి, మాజీ మంత్రి మాటల యుద్ధం
- 'అబద్ధాల రావు', 'డ్రామా రావు' హరీశ్, కేటీఆర్‌లపై మంత్రి ఫైర్
- 'పొంగులేటి కాదు.. పొంగులూటీ' 'బాంబులేటి'.. అంటూ హరీశ్ వ్యంగ్యాస్త్రాలు
- నాదర్‌గుల్ భూములపై హైడ్రా ఎక్కడ..?
- ప్రభుత్వ భూములైతే ఆక్రమణలు ఎందుకు కూల్చడం లేదు?
- ఇటీవల అసెంబ్లీలో మాజీ మంత్రి సవాల్
- పదేళ్ల బీఆర్ఎస్ పాపాలను బయటపెడతామన్న మంత్రి పొంగులేటి
- అప్పటి మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ ఎంక్వైరీ
- ఢీ అంటే ఢీ అంటున్న సీనియర్ నేతలు

2లో

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో అవినీతి ఆరోపణల సెగలు మునుపెన్నడూ లేని విధంగా తారాస్థాయికి చేరుకున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ అగ్రనేతల మధ్య సాగుతున్న మాటల యుద్ధం ఇప్పుడు వ్యక్తిగత దూషణలు, సవాళ్లు, ప్రతిసవాళ్లకు వేదికైంది. 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' మైనింగ్ వివాదం నుంచి నాదర్‌గుల్ భూముల కబ్జా ఆరోపణల వరకు.. ఇద్దరు అగ్రనేతలు పరస్పరం విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నారు. పొంగులేటిని పొంగులూటీ అంటూ హరీశ్ రావు ఎద్దేవా చేస్తే, బీఆర్ఎస్ నేతలను బ్లాక్‌మెయిల్ రాజకీయం చేస్తున్న 'అబద్ధాల రావులు' అని మంత్రి ధ్వజమెత్తారు. సీబీసీఐడీ విచారణలు, హైడ్రా ప్రతాపాల చుట్టూ తిరుగుతున్న ఈ అవినీతి వార్ రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## మతం మార్పిడి ముఠా ఘాతుకం

- పంజాగుట్టలో అన్నదమ్ముల అరాచకాలు
- ఐదుగురు హిందూ యువతులపై ప్రేమ పేరుతో వల.. మతం మారాలంటూ వేధింపులు
- నిందితుడు జమీర్‌పై గతంలోనే పోక్సో కేసు..
- బాధితురాలి ధైర్యంతో వెలుగులోకి వచ్చిన ఉదంతం..
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు

2లో

## పాకిస్థాన్‌లో హై అలర్ట్

- అమెరికా-ఇరాన్ శాంతి చర్చలకు ఇస్లామాబాద్ వేదిక
- కీలక దౌత్య సమావేశం
- రెడ్‌జోన్ సీల్ - కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- రాజధానిలో సెలవు ప్రకటించిన పాక్ ప్రభుత్వం
- హర్మూజ్ ఉద్రిక్తతల మధ్య ప్రపంచ దృష్టి ఇస్లామాబాద్‌పై..
- ప్రాంతీయ శాంతి దిశగా మధ్యవర్తిత్వానికి సిద్ధమైన పాకిస్థాన్

2లో

## కేసీఆర్‌తో జీవన్‌రెడ్డి భేటీ



- నన్ను దేవుడే పంపిండు.. అంటూ కేసీఆర్‌తో మాజీ మంత్రి భావోద్వేగ వ్యాఖ్యలు
- ఎర్రవెల్లి నివాసంలో స్వాగతం పలికిన కేటీఆర్, మాజీ మంత్రులు
- జగిత్యాల రాజకీయాల్లో మారనున్న సమీకరణలు

2లో

# ఎయిడ్స్ రక్తం ఇంజెక్ట్!

## ప్రేమోన్మాది వికృత చేష్టకు యువతి ఆత్మహత్య

- పెళ్లికి నిరాకరించిందని పైశాచిక ప్రతీకారం
- హెచ్‌ఐవీ రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించి ఘాతుకం



2లో

**వేద న్యూస్, హైదరాబాద్**

ప్రేమ పేరుతో వేధింపులు, ప్రతీకారంతో ఒక యువతి జీవితాన్ని నాశనం చేసిన దారుణ ఘటన మేడ్చల్ జిల్లాలో కలకలం రేపింది. పెళ్లికి నిరాకరించిందనే కారణంతో నిందితుడు హెచ్‌ఐవీ సోకిన రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించడంతో బాధితురాలు తీవ్ర మనోవేదనకు గురై చివరకు ఆత్మహత్య చేసుకోవడం రాష్ట్రాన్ని షాక్‌కు గురిచేసింది.

- మనస్తాపంతో ఇంజినీరింగ్ విద్యార్థిని బలవన్మరణం
- ల్యాబ్ టెక్నీషియన్ సహాయంతో రక్తం సేకరణ?
- పోలీసుల దర్యాప్తులో సంచలన నిజాలు వెలుగులోకి..
- నిందితుడికి ఉరిశిక్ష శిక్ష విధించాలని బంధువుల డిమాండ్
- మహిళా సంఘాల ఆగ్రహం.. కఠిన చట్టాల కోసం పిలుపు

వేద న్యూస్

శనివారం | ఏప్రిల్ 11, 2026

# మావోయిస్టుల భారీ లొంగుబాటు

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టుల ఏరివేత మరియు పునరావాస ప్రక్రియలో భాగంగా ఈరోజు ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో మొత్తం 42 మంది మావోయిస్టులు ఏకకాలంలో లొంగిపోయారు. గత కొంతకాలంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు గస్తీ ముమ్మరం చేయడం, గాలింపు చర్యలు పెంచడం మరియు ప్రభుత్వ పునరావాస పథకాలపై అవగాహన కల్పించడంతో ఈ భారీ లొంగుబాటు సాధ్యమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం రాష్ట్రంలో మావోయిస్టుల ప్రాబల్యాన్ని మరింత తగ్గించడమే కాకుండా, అడవి బాట పట్టిన వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడంలో పోలీసుల కృషిని చాటిచెప్పింది. లొంగిపోయిన వారిలో మావోయిస్టు పార్టీకి చెందిన అత్యంత కీలక నాయకులు ఉండటం గమనార్హం. పీఎల్‌జీఏ బెటాలియన్ కమాండర్ మరియు డీకేఎస్‌జెడ్‌సీ సభ్యుడు సోడి మల్ల అలియాస్ కేషాల్, జేఎంఎండబ్ల్యూసీ డివిజనల్ కమిటీ కార్యదర్శి చాప నారాయణ అలియాస్ గజేందర్, మరియు బీకేఎస్ఆర్ డివిజనల్ కమిటీ సభ్యుడు కద్తి సన్ను వంటి అగ్రశ్రేణి నేతలు డీజీపీ ఎదుట లొంగిపోయారు. వీరంతా పొరుగు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని పోలీసులు వెల్లడించారు. ఈ అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలవడం వల్ల సీపీఐ మావోయిస్టు పార్టీలోని మూడు మ్యాజిక్ వెపన్స్‌లో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ దాదాపు కనుమరుగు అయిందని డీజీపీ ప్రకటించారు. మావోయిస్టులు తమ వెంట భారీగా ఆయుధాలను మరియు సామగ్రిని తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు. లొంగిపోయిన వారి నుంచి ఐదు ఏకే–47 రైఫిళ్లు, నాలుగు ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, మూడు ఇన్‌సాస్ రైఫిళ్లు, ఆరు 303 రైఫిళ్లు, ఒక 9ఎంఎం స్టెన్ గన్ మరియు ఒక 9ఎంఎం పిస్టల్‌తో పాటు మొత్తం 36 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 1007 తూటాలు మరియు సుమారు 800 గ్రాముల బంగారాన్ని కూడా పోలీసులకు అప్పగించారు. ఇంత భారీ స్థాయిలో ఆయుధాలను అప్పగించి లొంగిపోవడం ఇటీవలి కాలంలో ఇదే అతిపెద్ద ఘటనగా పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయుధాలను వీడటమే కాకుండా అడవిలో తాము దాచుకున్న విలువైన వస్తువులను కూడా అప్పగించడం వారిలో వచ్చిన మార్పుకు నిదర్శనమని డీజీపీ అభిప్రాయపడ్డారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణ ఆర్థిక సహాయం మరియు పునరావాస సౌకర్యాలను కల్పించనున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు. లొంగిన వారందరికీ కలిపి మొత్తం ఒక కోటీ 93 లక్షల రూపాయల రివార్డు సొమ్మును త్వరలోనే అందజేస్తామని ప్రకటించారు. హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరిన వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి ఉపాధి అవకాశాలు మరియు సామాజిక భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఇంకా అడవిలో ఉన్న మావోయిస్టులు కూడా తమ ఆయుధాలను వీడి, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను విడిచిపెట్టి సాధారణ పౌరులుగా జీవించాలని సూచించారు. మీడియా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి ఈ లొంగుబాటుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటించారు.

## మతం మార్పిడి ముఠా ఘాతుకం


**వేద న్యూస్, హైదరాబాద్**

నగర నడిబొడ్డున ఉన్న పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో హిందూ యువతులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న ఒక భయంకరమైన వంచన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ప్రేమ పేరుతో అమాయక యువతులకు వల వేయడం, ఆపై వారిని లొంగదీసుకుని మతం మార్చుకోవాలంటూ చిత్రహింసలకు గురిచేస్తున్న ఇద్దరు అన్నదమ్ముల ఉదంతం నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. జమీర్ మరియు అతని తమ్ముడు మిరాజ్ కలిసి ఒక పక్కా ప్రణాళికతో ఈ అరాచకానికి పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇప్పటివరకు సుమారు ఐదుగురు యువతులను వీరు ఇదే తరహాలో మోసం చేసినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. నిందితుల్లో ఒకరైన జమీర్ ఒక క్రమ నేరస్థుడని పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. గతంలోనే ఇతనిపై ఒక మైనర్ బాలికను వేధించిన కేసులో పంజాగుట్ట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆ కేసులో జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చిన జమీర్, తన ప్రవర్తన మార్చుకోకుండా తమ్ముడు మిరాజ్‌తో కలిసి ఈ మతం మార్పిడి ముఠాను నడుపుతున్నట్లు తెలుస్తోంది. యువతులను ట్రాప్ చేయడం, వారిని శారీరకంగా లొంగదీసుకోవడం, ఆపై తమ మతంలోకి మారకపోతే చంపేస్తామని బెదిరించడం వీరి శైలిగా మారింది. తాజాగా ఓ యువతి ఫిర్యాదుతో వీరి అసలు స్వరూపం బయటపడింది. బాధిత యువతి వెల్లడించిన వివరాల ప్రకారం.. జమీర్ తొలుత ప్రేమ పేరుతో ఆమెకు దగ్గరయ్యాడు. ఆ తర్వాత ఆమెపై అఘాయిత్యానికి పాల్పడటమే కాకుండా, తన మతంలోకి మారాలని బలవంతం చేశాడు. ఇందుకు నిరాకరించడంతో తన తమ్ముడు మిరాజ్‌తో కలిసి ఆమెను గదిలో బంధించి చిత్రహింసలకు గురిచేశాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తామని అన్నదమ్ములిద్దరూ కలిసి ఆమెను తీవ్రంగా బ్లాక్ మెయిల్ చేశారు. ప్రాణ భయం ఉన్నప్పటికీ, బాధితురాలు ధైర్యంగా పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించడంతో ఈ కిరాతకుల గుట్టు రట్టయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు.

## పాకిస్థాన్లో హై అలర్ట్

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాకిస్థాన్ కీలక పాత్ర పోషించేందుకు ముందుకొచ్చింది. అమెరికా–ఇరాన్ దేశాల మధ్య శాంతి చర్చలకు ఇస్లామాబాద్ వేదిక కావడంతో రాజధాని నగరం హై అలర్ట్‌లోకి వెళ్లింది. ఏప్రిల్ 11న జరగనున్న ఈ కీలక సమావేశం నేపథ్యంలో నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా పార్లమెంట్, ప్రభుత్వ కార్యాలయాలు, విదేశీ రాయబార కార్యాలయాలు ఉన్న రెడ్‌జోన్‌ను పూర్తిగా సీల్ చేసి భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ప్రధాన రహదారులపై పహారా కాస్తూ జనసంచారాన్ని నియంత్రిస్తున్నారు. చర్చల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని రాజధానిలో ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో పాటు వాణిజ్య సముదాయాలు, దుకాణాలను మూసివేయాలని ఆదేశించింది. ఈ సమావేశంలో అమెరికా తరఫున ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పాల్గొననున్నట్లు సమాచారం.



# పొంగులేటి వర్సెస్ తన్నీరు!!

- రాష్ట్ర రాజకీయాల్లో సెగలు పుట్టిస్తున్న అవినీతి సమరం!
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై రాజుకున్న రగడ
- తారస్థాయికి చేరిన మంత్రి, మాజీ మంత్రి మాటల యుద్ధం
- ‘అబద్ధాల రావు’, ‘డ్రామా రావు’ హరీశ్, కేటీఆర్‌లపై మంత్రి ఫైర్
- ‘పొంగులేటి కాదు.. పొంగులూటీ’ ‘బాంబులేటి’..అంటూ హరీశ్ రావు వ్యంగ్యాస్త్రాలు
- నాదర్‌గుల్ భూములపై హైడ్రా ఎక్కడ..
- ప్రభుత్వ భూములైతే ఆక్రమణలు ఎందుకు కూల్చడం లేదు?
- ఇటీవల అసెంబ్లీలో మాజీ మంత్రి సవాల్
- పదేళ్ల బీఆర్ఎస్ పాపాలను బయటపెడతామన్న మంత్రి పొంగులేటి
- అప్పటి మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ ఎంక్వైరీ
- ఢీ అంటే ఢీ అంటున్న అగ్రనేతలు

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో ఇద్దరు బలమైన నేతల మధ్య పోరు ఇప్పుడు వ్యక్తిగత దూషణల స్థాయికి చేరుకుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ నేతలను ‘అబద్ధాల రావు’, ‘డ్రామా రావు’ అని సంబోధిస్తే.. హరీశ్ రావు అంతకంటే ఘాటుగా స్పందిస్తూ పొంగులేటిని ‘పొంగులూటీ’, ‘బాంబులేటి’, ‘పొగరులేటి’ అంటూ విమర్శనాస్త్రాలు సంధించారు. సచివాలయం వేదికగా పొంగులేటి చేసిన విమర్శలకు, వనపర్తి జిల్లా రేవల్లి పర్యటనలో ఉన్న హరీశ్ రావు దీటుగా కౌంటర్ ఇవ్వడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

### రాఘవ కన్‌స్ట్రక్షన్స్.. మైనింగ్ వివాదం

మంత్రి పొంగులేటి కుటుంబానికి చెందిన ‘రాఘవ కన్‌స్ట్రక్షన్స్’ లక్ష్యంగా హరీశ్ రావు తన దాడిని ఉధృతం చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అసెంబ్లీలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌లో అవినీతి జరిగిందని, అనుమతులు లేకుండా క్రషర్లు నడుపుతున్నారని చెప్పారని హరీశ్ రావు గుర్తు చేశారు. ‘సీఎం చెప్పింది తప్పా? లేక మంత్రి పొంగులేటి చెబుతున్నది తప్పా?’ అని ఆయన సూటిగా ప్రశ్నించారు. అనుమతులు లేవని అధికారులు నోటీసులు ఇచ్చినా మంత్రి ఎందుకు బుకాయిస్తున్నారని, మైనింగ్ దోపిడీపై సమాధానం చెప్పాలని నిలదీశారు. తమ విమర్శల తర్వాతే రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంటైనర్లపై కాంగ్రెస్ జెండాలు తొలగించారని ఆరోపించారు.

### ఇద్దరు నేతల మాటల యుద్ధం

మరోవైపు, గొల్లపల్లి రిజర్వాయర్ బాధితులకు హరీశ్ రావు సంఘీభావం తెలపడం ద్వారా ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో ఒత్తిడి పెంచుతున్నారు. పొంగులేటి పేల్చిన బాంబులన్నీ తుస్సుమన్నాయి అని హరీశ్ ఎద్దేవా చేయగా.. అబద్ధాల రావులకు ప్రజలే బుద్ధి చెబుతారు అని పొంగులేటి దీటుగా సమాధానమిచ్చారు. ఇద్దరు అగ్రనేతల మధ్య సాగుతున్న ఈ అవినీతి వార్ కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో విచారణలు, అరెస్టుల దిశగా దారితీసేలా కనిపిస్తోంది. ఇది తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా మారనుంది.

### నాదర్‌గుల్ భూములపై ‘హైడ్రా’ ఎక్కడ?

రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్ సర్వే నంబర్ 613లోని భూముల వ్యవహారం ఇప్పుడు ఇద్దరి మధ్య ప్రధాన వివాదంగా మారింది. ఆ భూములు ప్రభుత్వానివే అని రెవెన్యూ అధికారులు చెబుతుంటే, అక్కడ రోజుకో కొత్త బోర్డు వెలుస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. ఒకవేళ అవి ప్రభుత్వ భూములే అయితే, అక్కడ ఆక్రమణలను తొలగించడానికి హైడ్రా ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. కేవలం పేదల ఇళ్లను కూల్చడానికే హైడ్రా పరిమితమా? మంత్రి కబ్జాలో ఉన్నాయని చెబుతున్న భూముల వద్దకు ఎందుకు వెళ్లడం లేదని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కు చిత్తశుద్ధి ఉంటే అక్కడ కాంపౌండ్ వాల్ కూల్చి వేయాలని డిమాండ్ చేశారు.

### సీబీసీఐడీ విచారణాస్త్రం..

హరీశ్ రావు ఆరోపణలను తిప్పికొడుతూ పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ హయాంలోని మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించారు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన మైనింగ్ అక్రమాల్లో ఎవరి హస్తం ఉందో, ఏ ‘హోమ్’ పాత్ర ఏమిటో బయటపెడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని, గత పదేళ్లలో వారు చేసిన పాపాలను కడుక్కోవడానికే ఇప్పుడు ఎదురుదాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై వస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధాలని, అన్నీ నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని జీఎస్టీ రికార్డులను సైతం మీడియా ముందుంచారు.

# ఎయిడ్స్ రక్తం ఇంజెక్ట్!



## ప్రేమోన్మాది వికృత చేష్టకు యువతి ఆత్మహత్య

- పెళ్లికి నిరాకరించిందని పైశాచిక ప్రతీకారం
- హెచ్ఐవీ రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించి ఘాతుకం
- మనస్తాపంతో ఇంజినీరింగ్ విద్యార్థిని బలవన్మరణం
- ల్యాబ్ టెక్నీషియన్ సహాయంతో రక్తం సేకరణ అనుమానం
- పోలీసుల దర్యాప్తులో సంచలన నిజాలు వెలుగు
- నిందితుడికి ఉరిశిక్ష విధించాలని బంధువుల డిమాండ్
- మహిళా సంఘాల ఆగ్రహం.. కఠిన చట్టాల కోసం పిలుపు

**వేద న్యూస్, హైదరాబాద్**

ప్రేమ పేరుతో వేధింపులు, ప్రతీకారంతో ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న దారుణ ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తోంది. మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన తాజాగా బాధితురాలు ఆత్మహత్య చేసుకోవడంతో విషాదాంతమైంది. నిందితుడు మనోహర్ పెళ్లి చేసుకోవాలని బాధితురాలిని దీర్ఘకాలంగా వేధిస్తున్నాడు. ఆమె నిరాకరించడంతో ఆమె జీవితాన్ని నాశనం చేయాలనే వికృత ఆలోచనతో హెచ్ఐవీ సోకిన రక్తాన్ని సేకరించి, మోసపూరితంగా ఇంజెక్షన్ ద్వారా ఎక్కించినట్లు పోలీసుల విచారణలో తేలింది. గత నెల 11న బాధితురాలిని ఒంటరిగా కలిసిన సమయంలో బహుమతి ఇస్తానని నమ్మించి కళ్లకు గంతలు కట్టి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని సమాచారం. అనంతరం ఆరోగ్యం క్షీణించడంతో పరీక్షలు చేయించుకున్న యువతికి హెచ్ఐవీ పాజిటివ్‌గా తేలడంతో తీవ్ర మానసిక కుంగుబాటుకు గురైంది. బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే జీవితంపై విరక్తి చెందిన ఆమె, తాను ఎలాంటి తప్పు చేయకపోయినా సమాజంలో తలెత్తుకోలేననే ఆవేదనతో తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికే నిందితుడిపై హత్యాయత్నం కేసులు నమోదు కాగా, యువతి మృతి చెందడంతో కేసును మరింత తీవ్రంగా పరిగణించి దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిందితుడికి ఉరిశిక్ష విధించాలని బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అతనికి సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుతం నిందితుడు మనోహర్ చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈ కేసులో అన్ని సాక్ష్యాధారాలను సేకరించి కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఈ ఘటన తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా కలిచివేస్తోంది.

# కేసీఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ

- నన్ను దేవుడే పంపిండు.. అంటూ కేసీఆర్‌తో జీవన్ రెడ్డి భావోద్వేగ వ్యాఖ్యలు
- ఎర్రవెల్లి నివాసంలో స్వాగతం పలికిన కేటీఆర్, మాజీ మంత్రులు
- జగిత్యాల రాజకీయాల్లో మారనున్న సమీకరణలు

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి మరియు సీనియర్ నాయకుడు టి. జీవన్ రెడ్డి శుక్రవారం నాడు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతో ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వక భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నివాసానికి చేరుకున్న జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించడమే కాకుండా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో సరికొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కేసీఆర్‌ను కలిసిన సమయంలో జీవన్ రెడ్డి అత్యంత భావోద్వేగానికి లోనయ్యారు. "అన్నా.. నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి పని చేయమని" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అక్కడ ఉన్న వారందరినీ ఆకట్టుకున్నాయి. గత కొంతకాలంగా సాగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఈ కలయిక ప్రాధాన్యత సంతరించుకుంది. కేసీఆర్ కూడా జీవన్ రెడ్డిని ఆత్మీయంగా పలకరించి, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు తెలుస్తోంది. పార్టీ బలోపేతం మరియు భవిష్యత్తు కార్యాచరణపై వీరి మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగినట్లు సమాచారం. ఈ భేటీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు హేమాహేమీలు పాల్గొన్నారు. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కె. సంజయ్ తదితరులు జీవన్ రెడ్డికి స్వాగతం పలికారు.

# గోషామహల్‌లో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్

- సామాన్యులకు అందుబాటులోకి ఆధునిక వసతులు
- 3.92 కోట్ల రూపాయల జీహెచ్ఎంసీ నిధులతో నిర్మాణం
- రెండు దశల్లో పూర్తి చేసిన మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అభివృద్ధి పనులు మంత్రి పొన్నం ప్రభాకర్



**వేద న్యూస్, హైదరాబాద్:**

నగరంలోని గోషామహల్ నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గోషామహల్‌లో నూతనంగా నిర్మించిన రామ్ మనోహర్ లోహియా మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నేడు అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నిరుపేదలు మరియు మధ్యతరగతి ప్రజలు తక్కువ ఖర్చుతో శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ఈ ఫంక్షన్ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌ను సుమారు 3.92 కోట్ల రూపాయల భారీ వ్యయంతో జీహెచ్ఎంసీ నిధులతో నిర్మించారు. రెండు దశల్లో చేపట్టిన ఈ నిర్మాణ పనులను అత్యాధునిక వసతులతో పూర్తి చేశారు. విశాలమైన హాల్‌తో పాటు డైనింగ్ ఏరియా మరియు వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక సౌకర్యాలను ఇక్కడ కల్పించారు. నగరంలోని జనసమ్మర్థం ఉన్న ప్రాంతాల్లో ఇటువంటి ఫంక్షన్ హాళ్ల నిర్మాణం వల్ల సామాన్యులపై ఆర్థిక భారం తగ్గుతుందని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ నిధులను ప్రజా ప్రయోజనాల కోసం మళ్లించడంలో భాగంగానే ఈ ప్రాజెక్టును పూర్తి చేసినట్లు వివరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మరియు స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వం ముందంజలో ఉంటుందని ఎంపీ పేర్కొన్నారు. ఈ ఫంక్షన్ హాల్ నిర్వహణ బాధ్యతలను స్థానిక అధికారులు పర్యవేక్షిస్తారని, పారదర్శకమైన పద్ధతిలో ప్రజలకు బుకింగ్ సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలియజేశారు. వారితో పాటు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ మరియు ఇతర ముఖ్య నేతలు, కార్పొరేషన్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు మరియు అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలోకి చేరుతున్నాయనడానికి ఈ ఫంక్షన్ హాల్ ఒక నిదర్శనమని సాయి కుమార్ పేర్కొన్నారు. స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమాల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త



- 2.1 శాతం డీఏ పెంపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరిన కరువు భత్యం
- జనవరి 2026 నుంచి పెంపు అమలు
- సప్లిమెంటరీ బిల్లుల ద్వారా బకాయిల చెల్లింపు
- ఉద్యోగుల సంక్షేమం సంస్థ బలోపేతమే లక్ష్యమన్న మంత్రి పొన్నం ప్రభాకర్

**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది కానుకగా తీపి కబురు అందించింది. ఉద్యోగులకు చెల్లించాల్సిన కరువు భత్యాన్ని (డీఏ) 2.1 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. తాజా పెంపుతో గతంలో ఉన్న 50.7 శాతం డీఏ ఇప్పుడు 52.8 శాతానికి చేరింది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది ఆర్టీసీ కార్మికులు మరియు ఉద్యోగులకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. ప్రజా పాలన ప్రభుత్వంలో ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు. పెరిగిన ఈ డీఏ 2026 జనవరి 1వ తేదీ నుండి అమలులోకి రానుంది. గత మూడు నెలలకు (జనవరి, ఫిబ్రవరి, మార్చి) సంబంధించిన బకాయిలను సప్లిమెంటరీ బిల్లుల ద్వారా మూడు విడతల్లో ప్రభుత్వం చెల్లించనుంది. ఈ డీఏ పెంపు వల్ల ఆర్టీసీపై ప్రతి నెలా సుమారు 2.82 కోట్ల రూపాయల అదనపు భారం పడనుంది. అయినప్పటికీ, కార్మికుల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం ఈ భారాన్ని భరించేందుకు సిద్ధమైంది. గతంలో జూలై 2025లో కూడా ప్రభుత్వం 2.1 శాతం డీఏను పెంచి 50.7 శాతానికి చేర్చింది. తాజా పెంపుతో ఉద్యోగులకు సంబంధించిన అన్ని డీఏ బకాయిలను ప్రభుత్వం క్లియర్ చేసినట్లయింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ రీజియన్ల రీజినల్ మేనేజర్లతో (ఆర్.ఎం) సమావేశమై సంస్థలో పెండింగ్‌లో ఉన్న పనులు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 2024 మే నెలలో ఆర్పీఎస్-2017 అమలు చేసినప్పటి నుండి ఉద్యోగుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఏకైక పెండింగ్ డీఏను కూడా ఇప్పుడు విడుదల చేయడం ద్వారా కార్మిక వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం మరియు ప్రయాణికుల సౌకర్యమే కేంద్రంగా పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, సంస్థను బలోపేతం చేయడంలో కార్మికుల పాత్ర కీలకమని ఆయన కొనియాడారు. డీఏ పెంపు సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులందరికీ మంత్రి తన శుభాకాంక్షలు తెలియజేశారు.

# తొందరపాటు నిర్ణయం సరికాదు

- 40 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకోవడం బాధాకరం
- రాజ్యసభ సీటు కోసం సీఎం ప్రయత్నించారు
- ఓపిక పట్టకుండా బీఆర్ఎస్‌లో చేరడం బాగోలేదు
- జీవన్ రెడ్డి నిర్ణయంపై దానం నాగేందర్ విమర్శలు



**వేద న్యూస్, హైదరాబాద్**

సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరాలని తీసుకున్న నిర్ణయంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఘాటుగా స్పందించారు. జీవన్ రెడ్డి వంటి అనుభవజ్ఞుడైన నాయకుడు ఇంత తొందరపాటు నిర్ణయం తీసుకోవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీలో దశాబ్దాల కాలం పాటు సేవ చేసిన ఆయనకు తగిన గుర్తింపు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్లప్పుడూ సానుకూలంగానే ఉన్నారని దానం పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వ్యక్తి, ఇప్పుడు అధికారం ఉన్న సమయంలో బయటకు వెళ్లడం చర్చనీయాంశంగా మారిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డి పట్ల ఎంతో గౌరవంతో ఉన్నారని, ఆయనకు సముచిత స్థానం కల్పించేందుకు నిరంతరం ప్రయత్నించారని దానం నాగేందర్ వెల్లడించారు. జీవన్ రెడ్డికి రాజ్యసభ సీటు ఇప్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చివరి వరకు ప్రయత్నం చేశారు. ఆయన స్థాయికి తగిన గౌరవం దక్కాలనేది సీఎం ఆకాంక్ష అని దానం స్పష్టం చేశారు. అయితే, పార్టీలో కొన్ని పరిణామాల వల్ల అసంతృప్తికి లోనైన జీవన్ రెడ్డి, ఓపిక పట్టకుండా నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. అధికార పార్టీలో ఉండి సమస్యలను పరిష్కరించుకోవాల్సింది పోయి, ప్రతిపక్షంలోకి వెళ్లడం వల్ల ఆయనకు వచ్చే లాభమేమీ లేదని విశ్లేషించారు. సుమారు 40 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉన్న జీవన్ రెడ్డి, ఇప్పుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలవడాన్ని దానం తప్పుబట్టారు. పార్టీ సీనియర్ నేతగా ఆయనకు కేడర్‌లో ఎంతో ఆదరణ ఉందని, ఆయన నిర్ణయం వల్ల కార్యకర్తలు అయోమయానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిని, అరాచకాలను విమర్శించిన జీవన్ రెడ్డి, ఇప్పుడు అదే పార్టీలోకి ఎలా వెళ్తారని ప్రశ్నించారు. సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే వ్యక్తిగా పేరున్న ఆయన, కేవలం కొన్ని స్థానిక రాజకీయ కారణాలతో పార్టీని వీడటం విచారకరమని అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో చోటుచేసుకున్న పరిణామాలే ఆయన నిష్క్రమణకు కారణమని వస్తున్న వార్తలపై కూడా దానం స్పందించారు. ఏవైనా సమస్యలు ఉంటే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాశం ఉందని, కానీ ఆయన నేరుగా పార్టీ మారాలని నిశ్చయించుకోవడం ఆయన రాజకీయ జీవితంలో ఒక మైనస్ పాయింట్ అవుతుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ఇలాంటి సమయంలో సీనియర్లు అండగా ఉండాల్సింది పోయి మధ్యలోనే వీడిపోవడం సరికాదన్నారు. జీవన్ రెడ్డి తన నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని దానం నాగేందర్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ తనను నమ్ముకున్న వారికి అన్యాయం చేయదని, భవిష్యత్తులో ఆయనకు మరిన్ని ఉన్నత అవకాశాలు ఉండేవని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిన వారంతా ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, ఇలాంటి తరుణంలో జీవన్ రెడ్డి తిరోగమన దిశలో అడుగులు వేయడం ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. ఏది ఏమైనా, ఒక సీనియర్ నేత పార్టీని వీడటం కాంగ్రెస్‌కు కొంత నష్టమేనని, అయితే ప్రజా మద్దతుతో పార్టీ ముందుకు సాగుతుందని దానం ధీమా వ్యక్తం చేశారు.

# వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్దపీట

- పేదల ఆరోగ్యానికి ప్రజా ప్రభుత్వం భరోసా
- గతంలో కంటే రెట్టింపు నిధుల కేటాయింపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డ
- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన

**వేద న్యూస్, ఖమ్మం:**



ఖమ్మం జిల్లాలోని నిరుపేద కుటుంబాలకు ఆరోగ్యపరంగా భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. శుక్రవారం పాలేరు నియోజకవర్గం క్యాంప్ కార్యాలయం వేదికగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కూసుమంచి మండలానికి చెందిన 191 మంది లబ్ధిదారులకు ఈ సహాయం అందింది. ఆపద కాలంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేదలకు ఈ నిధులు ఎంతో ఊరటనిస్తాయని, ప్రభుత్వం ఎల్లప్పుడూ వారి వెంటే ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీసు కమీషనర్ సునీల్ దత్ మంత్రి వెంట పాల్గొన్నారు. విద్య మరియు వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, అందుకోసం భారీగా నిధులను వెచ్చిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పేదవానికి భరోసా కల్పించడమే తమ లక్ష్యమని, ఆరోగ్య విషయంలో ఎవరైనా ఇబ్బంది పడితే ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. వైద్య ఖర్చుల విషయంలో గతంలో కంటే రెండు రెట్లు అధికంగా నిధులు కేటాయిస్తూ, పేదలపై భారం పడకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని ఆయన వివరించారు. అనారోగ్య కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న వారికి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం లాంటిదని మంత్రి కొనియాడారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో చెక్కులు అందేలా జిల్లా యంత్రాంగం వేగంగా చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. వైద్యం చేయించుకున్న తర్వాత ఆర్థిక ఇబ్బందుల వల్ల కోలుకోలేకపోయే స్థితిలో ఉన్న వారికి ఈ చెక్కులు వెన్నుదన్నుగా నిలుస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరిస్తూ, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ప్రభుత్వ ఫలాలు నేరుగా అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. పాలేరు నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను ఇక్కడ చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

# గతంలో జీవో ఇచ్చి ఇప్పుడు వ్యతిరేకించడం ఏంటి?

- గొల్లపల్లి రిజర్వాయర్‌పై హరీశ్ రావు ద్వంద్వ నీతి
- కల్వకుర్తి ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యం
- మంత్రి జూపల్లి కృష్ణారావు



**వేద న్యూస్, మహబూబ్ నగర్:**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై మాజీ మంత్రి హరీశ్ రావు చేస్తున్న విమర్శలపై రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని ఇప్పుడు హరీశ్ రావు వ్యతిరేకించడం ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనమని మంత్రి విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే స్వయంగా హరీశ్ రావు ఈ రిజర్వాయర్‌కు జీవో జారీ చేశారని, ఇప్పుడు అదే పనిని తాము ముందుకు తీసుకెళ్తుంటే అడ్డుకోవడం వెనుక అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే బీఆర్ఎస్ నేతలకు ముఖ్యంగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త ప్రాజెక్టులను కాసుల కోసమే చేపడుతున్నామన్న హరీశ్ రావు వ్యాఖ్యలను మంత్రి జూపల్లి తీవ్రంగా ఖండించారు. మరి గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులన్నీ కాసుల కోసమే కట్టారా? అని ఆయన నిలదీశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద సుమారు 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం కేవలం 4 టీఎంసీల కంటే తక్కువగా ఉందని ఆయన గుర్తు చేశారు. ఇంత భారీ ఆయకట్టుకు కనీసం 45 టీఎంసీల నీరు అవసరమని, అందుకే అదనపు రిజర్వాయర్ల నిర్మాణం అత్యవసరమని తాము భావిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. కల్వకుర్తి ఆయకట్టు స్థిరీకరణ కోసం 25 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లను నిర్మించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ మరియు తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ హయాంలోనూ తాను అనేకమార్లు ప్రతిపాదించినట్లు జూపల్లి గుర్తు చేశారు. ఈ క్రమంలోనే సుమారు 16 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ల నిర్మాణానికి బీజం పడిందని ఆయన వివరించారు. అందులో భాగమైన గొల్లపల్లి రిజర్వాయర్ పనులను ఇప్పుడు ప్రభుత్వం వేగవంతం చేస్తోందని, ఇది రైతుల చిరకాల వాంఛ అని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం చేసే ప్రతి మంచి పనిని అడ్డుకోవడమే విపక్షాల పనిగా మారిందని విమర్శించారు. పాలమూరు రైతుల కష్టాలు తెలిసిన వాడిగా తాను ఈ ప్రాజెక్టుల కోసం మొదటి నుంచీ పోరాడుతున్నానని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. రిజర్వాయర్లు లేకపోవడం వల్ల వర్షాకాలంలో వచ్చే నీటిని నిల్వ చేసుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు.

# ఘనంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం

**వేద న్యూస్, ఆదిలాబాద్:**



ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని హమాలీవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హోమి యోపతి వైద్య విధాన పితామహుడు శామ్యూల్ హనీమన్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. హోమియోపతి వైద్యం తక్కువ ఖర్చుతో సమర్థవంతమైన చికిత్స అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, ఇతర అధికారులు, వైద్యులు పాల్గొన్నారు. హోమియోపతి వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో వైద్యుల పాత్ర ముఖ్యమని పేర్కొన్నారు. అధికారులు మాట్లాడుతూ.. హోమియోపతి శరీర సహజ రోగనిరోధక శక్తిని పెంచుతుందని, దీర్ఘకాలిక వ్యాధుల నివారణలో ప్రయోజనకరమని తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని వెల్లడించారు.

వేద న్యూస్

శనివారం ఏప్రిల్ 11, 2026

# స్వప్రయోజనాల కోసమే మూసీ ప్రాజెక్ట్

- పేదల ఇళ్లు కూల్చకుండా అభివృద్ధి చేయాలి
- ఒక్క ఇల్లు కూల్చకుండా మూసీ అభివృద్ధి సాధ్యం కాదా?

'మూసీ'పై గోరేటి వెంకన్న గళం



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ప్రముఖ ప్రజా గాయకుడు గోరేటి వెంకన్న తనదైన శైలిలో రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మూసీ నదిని సుందరీకరించాలని తాము కూడా కోరుకుంటున్నామని, అయితే ఒక్క పేదవాని ఇల్లు కూడా కూల్చకుండా ఈ ప్రక్రియ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో పేదల గూడు చెడగొట్టడం సమంజసం కాదని, మానవీయ కోణంలో ఆలోచించి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రజాస్వామ్యం గురించి గొప్పగా మాట్లాడే కాంగ్రెస్ పార్టీ, పేదల ఇళ్లు కూల్చడాన్ని ప్రజాస్వామ్యం ఎలా అంటుందని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం సాగుతున్న మూసీ ప్రాజెక్టు వెనుక అనేక స్వప్రయోజనాలు దాగి ఉన్నాయని గోరేటి వెంకన్న ఆరోపించారు. సాంఘిక, ఆర్థిక, నైతిక మరియు ప్రాంతీయ అభివృద్ధి అని చెబుతున్నప్పటికీ, దీని వెనుక కేవలం కొందరి ప్రయోజనాల కోసమే ఈ హడావుడి చేస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. నదిని ప్రక్షాళన చేయాలంటే ముందుగా చేయాల్సింది ఇళ్ల కూల్చివేతలు కాదని, పరిశ్రమల నుండి వచ్చే రసాయన వ్యర్థాలు నదిలో కలవకుండా కట్టడి చేయడమని ఆయన స్పష్టం చేశారు. మూల కారణమైన కంపెనీ వ్యర్థాలను వదిలేసి, పేదల నివాసాలపై పడటం ఏ రకమైన న్యాయమని నిలదీశారు. రాజకీయ సమీకరణాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వెంకన్న కీలక సూచన చేశారు. ప్రస్తుతం ప్రభుత్వానికి కమ్యూనిస్టు పార్టీలతో పొత్తు ఉందని, ఈ నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు వంటి నాయకులను పిలిచి మూసీ సమస్యపై చర్చించాలని కోరారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వారితో చర్చించి, ఎవరికీ నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. కమ్యూనిస్టుల సలహాలు తీసుకుంటే పేదలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ద్వంద్వ నీతిని ఎండగడుతూ, ఇదే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే ఊరుకునేదా అని వెంకన్న ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ప్రతిపక్షంలో ఉన్నప్పటి మాటలను మర్చిపోవడం సరికాదన్నారు. మూసీ పునరుజ్జీవం పేరుతో వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు చేపడుతూ, పేదలను రోడ్డున పడేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ నది ప్రక్షాళన అనేది నగర ప్రజలందరి అవసరమని, కానీ అది పేదల కన్నీళ్లపై జరగకూడదని వెంకన్న హెచ్చరించారు. నది పరివాహక ప్రాంతంలోని పేద ప్రజల సామాజిక మరియు ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కేవలం సుందరీకరణ కోసం కాకుండా, నది సహజత్వాన్ని కాపాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బడుగు బలహీన వర్గాలకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పక్షాన పోరాటం తప్పదని ఆయన స్పష్టం చేశారు.

# మహిళా భద్రతకు 'షీ నేత్ర' బృందాలు

- హిడెన్ కెమెరాల చెక్‌కు హైదరాబాద్ పోలీసుల కొత్త అస్త్రం
- 7 ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు



**వేద న్యూస్, హైదరాబాద్:**

మహిళల భద్రత, వ్యక్తిగత గోప్యత రక్షణ కోసం హైదరాబాద్ సిటీ పోలీసులు 'షీ నేత్ర' పేరుతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాల్లో హిడెన్ కెమెరాల దుర్వినియోగాన్ని అరికట్టడమే ఈ బృందాల ప్రధాన లక్ష్యం. నగరంలోని 7 జోన్లకు ఒక్కో బృందం చొప్పున మొత్తం 7 టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. వీటికి అత్యాధునిక కెమెరా డిటెక్టర్లను అందజేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మాల్స్, హోటళ్లు, హాస్టళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా ట్రయల్ రూమ్స్, వాష్‌రూమ్స్ వంటి ప్రదేశాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ప్రతి సంస్థలో మహిళల భద్రత కోసం 'కస్టమర్ సేఫ్టీ ఇన్‌చార్జ్' నియామకం తప్పనిసరి చేయాలని పోలీసులు ఆదేశించారు. ఎక్కడైనా హిడెన్ కెమెరాలు గుర్తిస్తే సంబంధిత యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, బ్లాక్ లిస్ట్‌లో చేర్చే అవకాశముందని హెచ్చరించారు. మహిళల భద్రత సామాజిక బాధ్యత అని పేర్కొన్న పోలీసులు, అనుమానాస్పద ఘటనలు గమనిస్తే వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555కు కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. పోలీసుల ఈ చర్యకు మహిళా సంఘాలు, ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. టెక్నాలజీ సాయంతో మహిళల భద్రతను మరింత బలోపేతం చేయడంలో 'షీ నేత్ర' బృందాలు కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు.

# ప్రతి గడపకూ సంక్షేమ కాంతి

- కూసుమంచిలో మంత్రి పొంగులేటి పర్యటన
- ప్యాక్స్ గోదాముల ప్రారంభం
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**వేద న్యూస్, ఖమ్మం:**

రాష్ట్రంలో ప్రతి గడపకూ సంక్షేమం చేరవేసి, రైతులకు భరోసా కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కూసుమంచి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చేగొమ్మ గ్రామంలో రూ.1.52 కోట్లతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) గోదాములను మంత్రి ప్రారంభించారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ గోదాములు పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, ఎకరాకు ఆర్థిక సహాయం, పంటలకు బోనస్ వంటి పలు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. భూ వివాదాల పరిష్కారానికి కొత్త పాస్‌పుస్తకాలు అందజేస్తున్నామని చెప్పారు. కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 191 మందికి రూ.58.58 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. పేదలు వైద్యం కోసం అప్పుల పాలవకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. అనంతరం వెంకటాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్ట్ షాక్

- 239 మందికి పరీక్షలు.. 189 మందికి డ్రగ్స్ పాజిటివ్
- హైదరాబాద్ సిటీ పోలీస్ మెరుపు తనిఖీలు

**వేద న్యూస్, హైదరాబాద్:**



నగరంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కమిషనర్ ఆదేశాల మేరకు హెచ్-న్యూ, టాస్క్ ఫోర్స్, లోకల్ పోలీసులు సమన్వయంతో రౌడీ షీటర్లు, అనుమానిత డ్రగ్ వినియోగదారులపై మెరుపు తనిఖీలు చేపట్టారు. ఏప్రిల్ 9న నిర్వహించిన ఈ డ్రైవ్‌లో భాగంగా 239 మందిని అదుపులోకి తీసుకుని ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులు, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 189 మంది డ్రగ్స్ వాడుతున్నట్లు వైద్య నివేదికల్లో తేలింది. పాజిటివ్‌గా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించడంతో పాటు, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు చేపట్టారు. డ్రగ్స్ ప్రభావంతో నేరాలు పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్తగా ఈ డ్రైవ్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నగరాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడమే లక్ష్యమని పోలీసులు స్పష్టం చేశారు. సరఫరాదారులతో పాటు వినియోగదారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. పోలీసుల చర్యలను ప్రజలు స్వాగతించగా, యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు తెలియజేయాలని కోరారు.

# మహిళల సాధికారతకు ఇటుకల పరిశ్రమలు

- స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు



**వేద న్యూస్, హైదరాబాద్:**

మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఇటుకల తయారీ యూనిట్లను ప్రోత్సహిస్తోంది. గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు గృహ నిర్మాణ పథకాల కోసం అవసరమైన ఇటుకలను స్థానికంగా అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమం లక్ష్యంగా కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 736 మహిళా సంఘాల యూనిట్లు ఈ రంగంలో పనిచేస్తున్నాయి. ప్రస్తుతం రోజుకు 300 నుంచి 1000 ఇటుకలు ఉత్పత్తి చేస్తున్న ఈ యూనిట్లు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే రోజుకు 2000–2500 ఇటుకలు తయారు చేసే సామర్థ్యం ఉందని అధికారులు తెలిపారు. ఒక్కో యూనిట్ అభివృద్ధికి సుమారు రూ.18 లక్షల పెట్టుబడి అవసరమవుతుండగా, ప్రభుత్వం పీఎంఈజీపీ పథకం ద్వారా రుణాలు, 35 శాతం సబ్సిడీ అందిస్తోంది. స్త్రీనిధి, బ్యాంకుల ద్వారా కూడా ఆర్థిక సాయం కల్పిస్తున్నారు. యూనిట్ నిర్వహణపై 15 రోజుల శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకలను ఈ యూనిట్ల నుంచే కొనుగోలు చేయాలని నిర్ణయించడం ద్వారా మహిళా సంఘాలకు స్థిరమైన ఆదాయం లభిస్తోంది. దీని వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోంది. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ప్రభుత్వం మహిళా సాధికారతకు కట్టుబడి ఉందని చెప్పారు. మిర్జాపూర్‌కు చెందిన కుంట మల్లవాణి ఇటుకల యూనిట్ స్థాపించి విజయవంతంగా నడుపుతూ ఇతరులకు ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలిచారు.

# ఈజీ మనీ.. పెద్ద మోసం

**వేద న్యూస్, హైదరాబాద్**

- బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండండి.. పొదుపుపై దృష్టి పెట్టండి
- యువత తమ సమయాన్ని నైపుణ్యాభివృద్ధికి కేటాయించాలి
- తెలంగాణ పోలీసుల పిలుపు

తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌ల ఉచ్చులో పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకోకూడదని తెలంగాణ పోలీసులు సోషల్ మీడియా వేదికగా ఒక కీలకమైన అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. 'బెట్టింగ్ కాదు.. బెటర్ లైఫ్ ఎంచుకోండి!' అనే నినాదంతో సాగుతున్న ఈ ప్రచారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈజీ మనీ (సులభంగా డబ్బు సంపాదించడం) అనే ఆలోచన కేవలం ఒక మోసమని, దాని వెనుక ఉన్న ప్రమాదాలను గుర్తించాలని పోలీసులు హెచ్చరించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో చాలా మంది బెట్టింగ్ యాప్‌ల బారిన పడి ఆర్థికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి సంపాదించిన దానిలోనే నిజమైన విజయం మరియు తృప్తి ఉంటాయని పోలీసులు తమ సందేశంలో స్పష్టం చేశారు. బెట్టింగ్ యాప్‌లు కేవలం వినియోగదారులను ఆకర్షించేందుకు ఆరంభంలో చిన్న చిన్న విజయాలను చూపిస్తాయని, ఆ తర్వాత క్రమంగా బాధితులను అప్పుల ఊబిలోకి నెట్టేస్తాయని వివరించారు. ఈ విధమైన ఆన్‌లైన్ జూదం వల్ల ఆర్థిక నష్టమే కాకుండా మానసిక ఒత్తిడి, కుటుంబ కలహాలు మరియు ఇతర సామాజిక ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు. యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండి, తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని సూచించారు. మీ విలువైన డబ్బును జూదం వంటి అనైతిక పనులకు ఖర్చు చేయకుండా, పొదుపు మరియు తెలివైన ఇన్వెస్ట్‌మెంట్‌లలో పెట్టాలని తెలంగాణ పోలీసులు హితవు పలికారు. పొదుపు చేసిన సొమ్ము కష్టకాలంలో అండగా ఉంటుందని, కానీ బెట్టింగ్‌లో పెట్టిన డబ్బు తిరిగి వచ్చే అవకాశం లేదని గుర్తు చేశారు. ప్రతి రూపాయిని ఎంతో జాగ్రత్తగా సంపాదించుకుంటామని, దానిని ఇలాంటి అక్రమ యాప్‌ల పాలు చేయడం ఏమాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. యువత తమ అమూల్యమైన సమయాన్ని క్రీడలు, చదువు మరియు నూతన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి వినియోగించాలని పోలీసులు కోరారు.

# సామాజిక న్యాయం పేరుతో కాంగ్రెస్ మోసం

- చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లకు అన్యాయం
- జీవో-17 వెంటనే రద్దు చేయాలి
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్




**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. సామాజిక న్యాయం పేరుతో ప్రజలను మోసం చేస్తూ చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. జీవో-17 వల్ల స్థానిక పరిశ్రమలు, కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. స్కూళ్లు, గురుకులాల సరఫరా టెండర్లలో జాతీయ స్థాయి కంపెనీలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల చిన్న కాంట్రాక్టర్లు పక్కన పడుతున్నారని తెలిపారు. రూ.10 నుంచి 25 కోట్ల వరకు సాల్వెన్సీ నిబంధనలు పెట్టడం వారిపై భారంగా మారిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రొక్యూర్‌మెంట్ కాంట్రాక్టుల్లో బీసీలకు 42%, ఎస్సీలకు 18%, గిరిజనులకు 12% రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయలేదని విమర్శించారు. ఇది సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు. జీవో-17లో కఠిన నిబంధనలు పెట్టి పెద్ద కంపెనీలకు లాభం చేకూర్చే ప్రయత్నం జరుగుతోందని, ఇందులో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. హైకోర్టు సూచనలు వచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా వెంటనే జీవో-17ను రద్దు చేసి, ప్రొక్యూర్‌మెంట్ పాలసీలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

వేద న్యూస్

శనివారం ఏప్రిల్ 11, 2026

# 'వైశాఖి' వేడుకలకు కేటీఆర్‌కు ఆహ్వానం



- అమీర్‌పేట్ గురుద్వారా కమిటీ మర్యాదపూర్వక భేటీ
- ఏప్రిల్ 14న ఘనంగా ఖల్సా సాజన దివస్ వేడుకలు

**వేద న్యూస్, హైదరాబాద్:**

సిక్కు సమాజం అత్యంత పవిత్రంగా జరుపుకునే ఖల్సా సాజన దివస్‌వైశాఖి వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. అమీర్‌పేట్ గురుద్వారా కమిటీ ప్రతినిధులు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఏప్రిల్ 14న అమీర్‌పేట్‌లోని శ్రీ గురు గోవింద్ సింగ్ జీ మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ వేడుకలు నిర్వహించనున్నారు. సుమారు 8 వేల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ సిక్కు ప్రతినిధులతో ముచ్చటించి వేడుకల వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలో అన్ని మతాల పండుగలను సమానంగా గౌరవిస్తామని, మతసామరస్యాన్ని కాపాడటం తమ లక్ష్యమని తెలిపారు. సిక్కు సమాజం నగర అభివృద్ధిలో పోషిస్తున్న పాత్రను ప్రశంసించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వేడుకల సందర్భంగా గుర్బానీ కీర్తనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో గురుద్వారా కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# రక్తదానం.. ప్రాణదానం

- జనగామ కలెక్టరేట్‌లో సేవా స్ఫూర్తి
- 62 మంది రక్తదాతలతో విజయవంతమైన శిబిరం




**వేద న్యూస్, జనగామ:**

రక్తదానం ప్రాణదానంతో సమానం అనే సందేశాన్ని విస్తరించేందుకు జనగామ కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా ఆరోగ్య, వైద్య శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని డిఎంహెచ్ఓ మల్లిఖార్జున రావు, డిసిహెచ్ఎస్ నరేందర్ శర్మ, వైద్యాధికారులు ప్రారంభించారు. అధికారులు స్వయంగా రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో రక్తం ప్రాణాలను కాపాడగలదని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉంటాయని వివరించారు. శిబిరంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని మొత్తం 62 మంది రక్తదానం చేశారు. మొదటిసారి రక్తదానం చేసినవారితో పాటు అనుభవం ఉన్నవారు ఇతరులను ప్రోత్సహించారు. వైద్య సిబ్బంది సమన్వయంతో శిబిరం సజావుగా నిర్వహించగా, రక్తదాతలకు పండ్లు, జ్యూస్ అందించారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవా భావాన్ని పెంపొందిస్తాయని అధికారులు తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



- రైతులకు రూ. 2400 మద్దతు ధర హామీ

**వేద న్యూస్, కోరుట్ల:**

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కోరుట్ల, మెట్‌పల్లి గొల్లపల్లి ప్రాంతాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కలిసి ఈ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మొక్కజొన్నకు రూ. 2400 మద్దతు ధర నిర్ణయించి, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కేంద్రాల్లోనే పంటను విక్రయించాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ తూకం, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలను వేగవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రైతులు తేమ ప్రమాణాలకు అనుగుణంగా పంటను తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, మార్క్‌ఫెడ్ అధికారులు, తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# మాచర్ల అత్యాచారం కేసులో సంచలన మలుపు



- స్నాప్‌చాట్ పరిచయం నుంచి ఘాతుకం
- గుర్తుతెలియని వ్యక్తి అంటూ పోలీసులను తప్పుదోవ పట్టించిన బాధితురాలు
- గూగుల్ మ్యాప్స్ లోకేషన్ పంపి పిలిపించిన నిందితుడు
- సాంకేతిక ఆధారాలతో శ్రీనివాస్ అరెస్ట్.. 14 రోజుల రిమాండ్

**వేద న్యూస్, మాచర్ల:**

పల్నాడు జిల్లా మాచర్లలో ప్రభుత్వ ఉద్యోగినిపై జరిగిన అత్యాచారం కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తొలుత గుర్తుతెలియని వ్యక్తి దాడి చేశాడని ఫిర్యాదు చేసిన బాధితురాలు, తర్వాత దర్యాప్తులో నిందితుడు తనకు పరిచయమున్న వ్యక్తేనని పోలీసులు గుర్తించారు. స్నాప్‌చాట్ ద్వారా ఏర్పడిన పరిచయం ఈ ఘటనకు దారితీసిందని పోలీసులు తెలిపారు. ఘటన రోజున బాధితురాలే తన ఇంటి గూగుల్ మ్యాప్స్ లోకేషన్‌ను నామాల శ్రీనివాస్‌కు పంపి పిలిపించుకున్నట్లు సాంకేతిక ఆధారాలు వెల్లడించాయి. ఇంటికి వచ్చిన నిందితుడు ఆమెపై దాడికి ప్రయత్నించగా, ప్రతిఘటన ఎదురవడంతో కాళ్లు చేతులు కట్టేసి అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. అనంతరం బాధితురాలు నిందితుడు పరిచయస్తుడేనని దాచిపెట్టి పోలీసులను తప్పుదోవ పట్టించినట్లు విచారణలో తేలింది. సీసీటీవీ ఫుటేజీలు, ఫోన్ చాటింగ్ ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు ఈ నెల 8న మాచర్ల రైల్వే స్టేషన్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితుడు తన నేరాన్ని అంగీకరించగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. సోషల్ మీడియా పరిచయాలు ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# పౌర సదుపాయాల మెరుగుదలే లక్ష్యం

- మేడ్చల్ సర్కిల్‌లో కమిషనర్ పర్యటన.. కీలక ఆదేశాలు



**వేద న్యూస్, మేడ్చల్:**

పౌర మౌలిక సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ మేడ్చల్ సర్కిల్ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. డిప్యూటీ కమిషనర్, ఇతర అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. చెరువుల్లో పేరుకు పోయిన గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలని, మురుగునీరు, ఘన వ్యర్థాలు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలో పూడికతీత చేపట్టి, లీకేజీలు లేకుండా పర్యవేక్షణ పెంచాలని అధికారులకు ఆదేశించారు. మేడ్చల్ హైవే నుంచి అయోధ్య ఎక్స్ రోడ్స్ వరకు రహదారులపై గుంతలను పూడ్చి, ప్యాచ్ వర్క్ పనులు తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరద నీటి కాలువలను శుభ్రపరచాలని, పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. నగరంలో క్రీడా ప్రాంగణాలు, థీమ్ పార్కుల అభివృద్ధికి అనువైన స్థలాలను గుర్తించాలని అధికారులను కోరారు. ప్రజల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, మేడ్చల్ సర్కిల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

# నాగర్‌కర్నూల్‌లో వైద్య సదుపాయాల విస్తరణ

- రూ. 23.75 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్ షురూ
- ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ



**వేద న్యూస్, నాగర్‌కర్నూల్:**

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించి వైద్య రంగ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. జిల్లాలో ఆరోగ్య సేవల మెరుగుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి తెలిపారు. పర్యటనలో భాగంగా నాగర్‌కర్నూల్ మెడికల్ కాలేజీలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలు తెలుసుకున్నారు. భవిష్యత్తులో మంచి వైద్యులుగా సేవ చేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 23.75 కోట్ల వ్యయంతో నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ను మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సదుపాయంతో అత్యవసర వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. అనంతరం తెలకపల్లి గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సమీపంలోనే వైద్య సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఆరోగ్య రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జనగణన, భూ స్వాధీన పనులపై సమీక్ష

- ఖచ్చితమైన డేటా సేకరణకు కలెక్టర్ ఆదేశాలు



**వేద న్యూస్, జగిత్యాల:**

జగిత్యాల జిల్లాలో కొనసాగుతున్న జనగణన, భూ స్వాధీన పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీక్షించారు. కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధికారులతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. జనగణన దేశ అభివృద్ధికి కీలకమని పేర్కొన్న కలెక్టర్, ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితంగా సేకరించాలని ఆదేశించారు. డేటా సేకరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. భూ స్వాధీన ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, భూ యజమానులకు అన్యాయం జరగకుండా చూడాలని ఆదేశించారు. సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని, శాఖల మధ్య సమన్వయం పెంచి వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మూడేళ్లకే చెస్‌లో రెండు ప్రపంచ రికార్డులు

- చిన్నారి శ్రీంశుకు గాంధీ భవన్‌లో ఘన సన్మానం



**వేద న్యూస్, హైదరాబాద్:**

మూడేళ్ల వయసులోనే చెస్‌లో రెండు ప్రపంచ రికార్డులు సృష్టించిన చిన్నారి కొండా శ్రీంశు మురళీకృష్ణ పటేల్ విశేష ప్రతిభ కనబర్చాడు. మంత్రి కొండా సురేఖ మనవడైన ఈ చిన్నారిని గాంధీ భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) సర్టిఫికెట్లను అందజేశారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబర్చినందుకు నాయకులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, ప్రభుత్వ విప్ ఇలయ్య, ఎమ్మెల్యే మందుల శామ్యూల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారి భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, ఇలాంటి ప్రతిభను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు.

వేద న్యూస్

శనివారం ఏప్రిల్ 11, 2026

# అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేయాలి

## – సీపీ సన్ ప్రీత్ సింగ్




**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుండి 18 వరకు నిర్వహించనున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలని పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో పోలీసు కమిషనర్ అధ్యక్షతన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు చాహాత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద లతో కలసి అదనపు కలెక్టర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఆర్ & బి, రవాణా తదితర శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ నెల 13 నుండి 18 వరకు కార్యక్రమాలను ప్రణాళిక బద్ధంగా ప్రతిరోజు సమర్ధంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీసు, రెవిన్యూ, రవాణా, ఆర్ & బి శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు తరచుగా జరిగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హసన్‌పర్తి పరిధిలో ప్రమాదాలు అధికంగా ఉన్నందున జాతీయ రహదారులు, ఆర్ & బి శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ప్రమాదంపై విచారణ జరిపి కారణాలను గుర్తించి నివారణ చర్యలు అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్ల భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడం, వాహనదారుల్లో బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాటు పెంపొందించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. పెట్రోల్ బంక్ యాజమాన్యాలతో సమావేశాలు, డ్రైవర్లకు కంటి పరీక్షలు ఇప్పటికే నిర్వహించామని, అవసరమైన వారు కంటి అద్దాలు తప్పనిసరిగా వినియోగించాలన్నారు. పోలీస్ మరియు సాంస్కృతిక కళాబృందాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచుతామని తెలిపారు. చివరి రోజున రూల్స్ పాటించిన వారికి ప్రశంస పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీఏ ఆధ్వర్యంలో పాఠశాల బస్సుల ఫిట్నెస్, డ్రైవర్ల అర్హతలు, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న రహదారులపై ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై రోజువారీ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా, మునిసిపల్, గ్రామ స్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించేలా పర్యవేక్షణ చేయాలని, అధికారులు కూడా ఆదర్శంగా ఉండాలని సూచించారు. మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి, బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాల బస్సుల ఫిట్నెస్, డ్రైవర్ల అర్హతలపై దృష్టి పెట్టడంతో పాటు అవసరమైన కంటి అద్దాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సూచించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ బ్లాక్ స్పాట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుబడి ఉండాలని, 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణానికి కలిసి ముందడుగు వేయాలని అన్నారు. "వివిధ ప్రచార మాధ్యమాలు, కళాజాత కార్యక్రమాల ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించినప్పుడే ప్రమాదాలను తగ్గించగలమని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాల బస్సుల ఫిట్నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మొత్తం బస్సులలో గణనీయమైన సంఖ్యలో ఫిట్నెస్ తనిఖీలు పూర్తిచేసి, డ్రైవర్లకు ఆరోగ్య, కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. మిగిలిన బస్సుల ఫిట్నెస్‌ను త్వరితగతిన పూర్తి చేసి, అన్ని వాహనాలు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రతను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై మాట్లాడుతూ, నేషనల్ హైవేపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు అవసరమని తెలిపారు. ప్రమాదాలున్న ప్రాంతాలను గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డిపిపి లు రాజమహేంద్ర నాయక్, దార కవిత, అంకిత్ కుమార్, ప్రభాకర్ రావు, అదనపు కలెక్టర్లు ఎన్. రవి, సంధ్యారాణి, వై వి గణేష్, ఆర్ అండ్ బి, రవాణా, రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, సంబంధిత శాఖల జిల్లాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యం

## – జనగామలో 'అరైవ్-అలైవ్' కార్యక్రమాలకు శ్రీకారం



**వేద న్యూస్, జనగామ:**

ప్రజల భద్రతే ప్రభుత్వ ధ్యేయమని, ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అరైవ్–అలైవ్ కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ నెల 13 నుంచి 18 వరకు వారోత్సవాలుగా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్య, విద్యా తదితర శాఖలు సమన్వయంతో కార్యక్రమాలను అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రచారం, స్పీడ్ కంట్రోల్ డ్రైవ్స్, మద్యం సేవించి డ్రైవింగ్‌పై తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, ప్రథమ చికిత్స శిక్షణ, ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. రోడ్ల సంరక్షణ, ట్రాఫిక్ సూచిక బోర్డుల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏసీపీ పండరి చేతన్ నితిన్, ఆర్డీఓ వెంకన్న, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతికి చట్టబద్ధత..

- ప్రధానికి ధన్యవాదాల తీర్మానం
- విశాఖ క్వాంటం వ్యాలీకి గ్రీన్ సిగ్నల్
- రూ.39 వేల కోట్ల పెట్టుబడులకు మంత్రివర్గం ఆమోదం
- విద్యా కమిషన్ రద్దు..
- ఫీజుల నియంత్రణకు ఎఫ్ఆర్సీ ఏర్పాటు
- భూ కేటాయింపులు, అభివృద్ధి అంశాలపై కీలక నిర్ణయాలు
- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు




**వేద న్యూస్, అమరావతి:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వెలగపూడి సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో 60 అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. అమరావతికి చట్టబద్ధత కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కేబినెట్ ధన్యవాదాలు తెలిపింది. రాజధాని అంశంపై ఉన్న అనిశ్చితి తొలగిపోయిందని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే రూ.39 వేల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. దీని ద్వారా పరిశ్రమలు స్థాపించి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం విస్తోంది. విశాఖపట్నంలో క్వాంటం వ్యాలీలో మూడు సంస్థల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఐటీ రంగంలో రాష్ట్రం మరింత ముందుకు సాగుతుందని తెలిపారు. విద్యా రంగంలో సంస్కరణల భాగంగా విద్యా కమిషన్‌ను రద్దు చేసి, ప్రైవేట్ ఫీజుల నియంత్రణ కోసం కొత్తగా ఫీజ్ రెగ్యులేటరీ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక భూ కేటాయింపులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలుపై కూడా చర్చించి, ప్రజలకు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి మంత్రులకు సూచించారు.

# టేకుమట్ల పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ

## – రికార్డులు, కేసుల పురోగతిపై సమీక్ష



**వేద న్యూస్, జయశంకర్ భూపాలపల్లి:**

వార్షిక తనిఖీలలో భాగంగా టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను అధికారులు సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాల్లో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతను తెలియజేశారు. హరిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో పారదర్శకత పాటించాలని, ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. దర్యాప్తు ప్రక్రియలో నాణ్యత పెంచి కేసులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, శుభ్రత, పత్రాల నిర్వహణలో మెరుగులు దిద్దాలని అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ ఫ్లోరింగ్ నిర్మాణానికి శంకుస్థాపన

## – జన్మదిన సందర్భంగా చేసిన గంట రవికుమార్



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

సత్యం (గ్రూప్స్) ఫౌండర్, వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు గంట రవికుమార్ తన 45వ పుట్టినరోజును వినూత్నంగా నిర్వహించి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. సాధారణంగా పుట్టినరోజుల సందర్భంగా ఫ్లెక్సీలు, కేక్ కటింగ్‌లు, క్రాకర్స్ వంటి వృధ ఖర్చులకు దూరంగా ఉంటూ, శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పాఠశాలలో విద్యార్థులకు సరైన మూత్రశాలల సౌకర్యం లేకపోవడాన్ని గుర్తించిన ఆయన, కొత్తగా మూత్రశాలల నిర్మాణాన్ని ప్రారంభించారు. అదేవిధంగా పాఠశాల భవనంలో ఫ్లోరింగ్ పనులను కూడా చేపట్టి, విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ, "పుట్టినరోజులు, పెళ్లి వార్షికోత్సవాల పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేయడం వల్ల సమాజానికి ఉపయోగం ఉండదు. అదే డబ్బుతో చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తే సమాజానికి మేలు జరుగుతుంది" అని అన్నారు. ఆయన చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మంది ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిగా నిలవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నరేందర్ స్వామి, గంట రవికుమార్ ఫౌండేషన్ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

- రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్ట చర్యలు
- కలెక్టర్ బి. సత్యప్రసాద్
- జగిత్యాలలో అరైవ్-అలైవ్ క్యాంపెయిన్ ప్రారంభం
- బ్లాక్ స్పాట్లు, సీసీ కెమెరాలు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు



**వేద న్యూస్, జగిత్యాల:**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 13 నుంచి 18 వరకు "అరైవ్అలైవ్" క్యాంపెయిన్ నిర్వహిస్తూ ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని సూచించారు. జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించిన కలెక్టర్, బ్లాక్ స్పాట్ల గుర్తింపు, సీసీ కెమెరాల ఏర్పాటు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు వంటి చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. జగిత్యాల పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ మరమ్మత్తులు, లైటింగ్ సమస్యల పరిష్కారం, బస్టాండ్ పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని సూచించారు. ప్రమాద ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించి భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్ రహదారులపై బ్లాక్ స్పాట్ల వద్ద సూచిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలను తగ్గించాలన్నారు. చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని తెలిపారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక తనిఖీలు కొనసాగిస్తున్నామని, హెల్మెట్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు, రహదారి భద్రత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ ఇంజక్షన్ దాడికి గురైన యువతి ఆత్మహత్య



**వేద న్యూస్ హైదరాబాద్ :**

నగరంలోని పోచారం ఐటీకారిడార్ ఓ ఉన్మాది ఎయిడ్స్ ఇంజక్షన్ తో దాడికి గురైన యువతి ఆత్మహత్య చేసుకుంది. రమణి అనే యువతి పెళ్లికి నిరాకరించిందన్న కసితో మనోహర్ అనే ఎయిడ్స్‌గ్రస్తుడు గత నెల 11న యువతిని బెదిరించి ఎయిడ్స్ ఉన్న రక్త ఇంజక్షన్ ఇచ్చాడు. అన్నోజిగూడ రాజీవ్ గృహ కల్పలో ఉంటున్న యువతి శుక్రవారం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా ఈ ఘటనలో ఇప్పటికే నిందితుడు మనోహర్ ప్రస్తుతం జైలులో ఉన్నాడు.

వేద న్యూస్

శనివారం ఏప్రిల్ 11, 2026

# హెచ్ఎండీఏ కాంట్రాక్టుల్లో భారీ అవినీతి



- రూ.1,142 కోట్ల పనులు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు
- ఆఫీసర్స్ కమిటీ సిఫార్సులను సీఎం బుట్టదాఖలు చేశారు
- స్టేట్ ఫైనాన్షియల్ కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత ఆగ్రహం

**వేద న్యూస్, హైదరాబాద్:**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో జరుగుతున్న పనుల కేటాయింపులపై ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకతను విస్మరించి, భారీ ఎత్తున నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులను కట్టబెడుతూ అవినీతికి పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ పనుల కేటాయింపులపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తూ తమకు కావాల్సిన వారికి పనులు అప్పగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో పనుల కేటాయింపునకు సంబంధించి గతంలోనే ఒక ఉన్నత స్థాయి ఆఫీసర్స్ కమిటీ కొన్ని కీలక సిఫార్సులు చేసిందని కవిత గుర్తు చేశారు. పనులను నామినేషన్ పద్ధతిలో కాకుండా కేవలం బహిరంగ టెండర్ల ద్వారానే కట్టబెట్టాలని ఆ కమిటీ స్పష్టంగా నివేదిక ఇచ్చిందని ఆమె తెలిపారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ రిపోర్టును ఏమాత్రం పట్టించుకోకుండా పక్కన పెట్టేశారని ఆమె విమర్శించారు. నిపుణుల కమిటీ సూచనలను బేఖాతరు చేస్తూ ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లడం వెనుక పెద్ద ఎత్తున క్విడ్ ప్రో కో కుట్ర దాగి ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు అనుమానం వ్యక్తం చేశారు. సుమారు 1,142 కోట్ల రూపాయల విలువైన పనులను నామినేషన్ పద్ధతిలో ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని కవిత స్పష్టం చేశారు. ఇది స్టేట్ ఫైనాన్షియల్ కోడ్‌కు పూర్తి వ్యతిరేకమని, ప్రభుత్వ నిబంధనలను కాంగ్రెస్ నేతలు కాలరాస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియ ద్వారా పనులు కేటాయిస్తే ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా, పనుల్లో నాణ్యత కూడా ఉంటుందని ఆమె వివరించారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం కేవలం కమిషన్ల కోసమే నామినేషన్ పద్ధతిని ఎంచుకుందని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని నామినేషన్ పద్ధతిలో ఇచ్చిన కాంట్రాక్టులను రద్దు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రతి పనిని పారదర్శకంగా టెండర్ల ద్వారానే అర్హులైన వారికి అప్పగించాలని ఆమె సూచించారు. లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ఎండగడతామని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలపై తాము పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## తెలంగాణ జాగృతిలోకి కొడంగల్ నేతల చేరిక


- కండువా కప్పి ఆహ్వానించిన కవిత

**వేద న్యూస్, నారాయణపేట:**



నారాయణపేట జిల్లాలో తెలంగాణ జాగృతి కార్యకలాపాలు మరింత వేగవంతమవుతున్నాయి. జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్తగా చేరిన నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సంస్థ బలోపేతానికి కృషి చేయాలని, సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. కొత్తగా చేరిన నాయకులు మాట్లాడుతూ జాగృతి చేపడుతున్న కార్యక్రమాలు ఆకర్షించాయని, ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వామ్యం కావాలని చేరినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్త నాయకుల చేరికతో సంస్థ మరింత బలపడుతుందని, గ్రామ స్థాయి వరకు విస్తరణకు కృషి కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింధీ భాషలో భారత రాజ్యాంగం విడుదల




**వేద న్యూస్, నేషనల్ డెస్క్:**

- భాషా వైవిధ్యానికి పెద్దపీట
- దేవనాగరి, పర్షియన్ లిపుల్లో ఆవిష్కరణ

భారత రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడికి వారి మాతృభాషలో అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కీలక ముందడుగు పడింది. ఉపరాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భారత రాజ్యాంగం సింధీ భాషా ప్రతిని విడుదల చేశారు. ఈ ప్రతిని దేవనాగరి, పర్షియన్ లిపుల్లో రూపొందించడం విశేషం. సింధీ భాషా దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం భాషా వైవిధ్యానికి గౌరవం చాటడమే కాకుండా రాజ్యాంగ విలువలను మరింత మందికి చేరువ చేసే దిశగా కీలకంగా నిలిచింది. ఈ సందర్భంగా రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ, దేశ విభజన అనంతరం క్లిష్ట పరిస్థితుల్లోనూ సింధీ సమాజం తమ భాష, సంస్కృతిని కాపాడుకోవడం ప్రశంసనీయమని అన్నారు. మాతృభాషలో రాజ్యాంగం అందుబాటులోకి రావడం వల్ల ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. కేంద్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ మాట్లాడుతూ, రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలు ప్రతి పౌరుడికి చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎనిమిదో షెడ్యూల్‌లో ఉన్న అన్ని భాషల్లో రాజ్యాంగాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా చట్టాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ శాసనసభ స్పీకర్ వాసుదేవ్ దేవనాని, లోక్‌సభ ఎంపీ శంకర్ లాల్వానీ తదితరులు పాల్గొన్నారు. సింధీ భాషా ప్రతిని రూపొందించిన పండితులు, అనువాదకులను అభినందించారు. మొత్తంగా సింధీ భాషలో రాజ్యాంగం విడుదల చేయడం ద్వారా భారతదేశ భాషా వైవిధ్యాన్ని గౌరవించినట్లయిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక చర్యగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఖాజీపేట ఘటన దారుణం

- మహిళలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం
- అఘాయిత్యాలపై ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదు
- నిందితుడికి కఠిన శిక్ష డిమాండ్
- వైఎస్ ఆర్ అధినేత జగన్మోహన్ రెడ్డి

**వేద న్యూస్, తాడేపల్లి:**



వైఎస్సార్ జిల్లాలోని ఖాజీపేటలో జరిగిన దారుణ ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 16 ఏళ్ల విద్యార్థిని కీర్తనను ప్రేమోన్మాది గొంతు కోసి హత్య చేసిన ఘటన సమాజాన్ని కలవరపెడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో జరిగిన ఈ ఘటన భయాందోళనలకు గురిచేస్తోందన్నారు. గాయపడిన విద్యార్థిని కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందడం మరింత విషాదకరమని జగన్ పేర్కొన్నారు. మహిళలపై ఇలాంటి దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించలేమని స్పష్టం చేశారు. సమాజంలో మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, హత్యలు పెరుగుతున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. చట్టవ్యవస్థపై నేరస్తులకు భయం లేకుండా పోయిందని, ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతున్నా కఠిన చర్యలు కనిపించడం లేదన్నారు. పోలీసుల అప్రమత్తత కొరవడటం, సరైన నిఘా లేకపోవడమే ఇలాంటి నేరాలకు కారణమని జగన్ అభిప్రాయపడ్డారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో నమ్మకం కలిగించే విధంగా చర్యలు అవసరమన్నారు. ఈ ఘటనకు బాధ్యుడైన నిందితుడికి కఠిన శిక్ష విధించాలని జగన్ డిమాండ్ చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో కేసు నమోదు చేసి వేగంగా న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఇలాంటి దాడులకు ఇది ఒక హెచ్చరికగా నిలవాలని అన్నారు. మరణించిన కీర్తన కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ దుర్ఘటనను తట్టుకునే ధైర్యం వారికి కలగాలని ప్రార్థించారు. సమాజం మొత్తం కలిసి మహిళల భద్రత కోసం ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

# మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం



**వేద న్యూస్, కడప:**

మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ కడప జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు సి.కె దిన్నె సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాల మద్దిలేటి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మహిళలు, బాలికలు తమ భద్రతపై అప్రమత్తంగా ఉండేలా చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిలిచింది. ఈ సందర్భంగా పోలీసు అధికారులు 'శక్తి' యాప్ వినియోగంపై విపులంగా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ ద్వారా తక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు. అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, డయల్ 112 వంటి అత్యవసర సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు తమ భద్రత కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొని భద్రతా మార్గదర్శకాలను తెలుసుకున్నారు. పోలీసుల సూచనలను ఆసక్తిగా విన్నారు. మహిళా భద్రతపై ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. సమాజంలో మహిళలు భయంలేకుండా జీవించే వాతావరణం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

# బీహార్ రాజకీయాల్లో ముగిసిన శకం



**వేద న్యూస్, నేషనల్ డెస్క్:**

బీహార్ రాజకీయాల్లో సుదీర్ఘకాలం తనదైన ముద్ర వేసిన నితీష్ కుమార్ రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి కొత్త రాజకీయ అధ్యాయాన్ని ప్రారంభించారు. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, అర్జున్ రామ్ మేగ్వాల్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. జేడీయూ నేతలు, ఇతర పార్టీ నాయకులు కూడా నితీశ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా బీహార్ అభివృద్ధి కోసం పనిచేశానని, ఇకపై జాతీయ రాజకీయాల్లో సేవలందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దీంతో బీహార్ రాజకీయాల్లో ఆయన సుదీర్ఘ ప్రస్థానం ముగిసినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా నితీశ్ కుమార్ భారత రాజకీయాల్లో అరుదైన ఘనతను సాధించారు. లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసనసభ, శాసనమండలి నాలుగు చట్టసభలలో సభ్యుడిగా పనిచేసిన కొద్ది మంది నేతల్లో ఆయన ఒకరిగా నిలిచారు. 1985లో ఎమ్మెల్యేగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం, ఎనిమిది సార్లు ముఖ్యమంత్రిగా కొనసాగడం విశేషం. ఇక రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఇప్పటికే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన నితీశ్, ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవడం ఖరారైంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 14న బీహార్ కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకునే ప్రక్రియ జరగనుంది. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరీకి అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మొత్తంగా నితీశ్ కుమార్ రాజ్యసభ ప్రవేశం బీహార్ రాజకీయాల్లో ఒక శకం ముగింపుకు సంకేతంగా నిలవగా, జాతీయ రాజకీయాల్లో ఆయన పాత్రపై ఆసక్తి నెలకొంది.

# వల్లభనేని బాబురావుకు మంత్రి పరామర్శ

**వేద న్యూస్, విజయవాడ:**



విజయవాడలోని డాక్టర్ శివప్రసాద్ హృదయాలయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు, గ్రంథాలయ మాజీ చైర్మన్ వల్లభనేని బాబురావును రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి వైద్యులతో మాట్లాడి బాబురావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రస్తుతం అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకుని అవసరమైన అన్ని వైద్య సేవలు అందించాలని సూచించారు. బాబురావు త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. పార్టీకి, సమాజానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ ఆరోగ్యం మెరుగుపడాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా ఆసుపత్రికి చేరుకుని ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. వల్లభనేని బాబురావు త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రామాయపట్నం పోర్ట్ అభివృద్ధికి కీలక నిర్ణయాలు

- గడువు పొడిగింపుకు ఆమోదం
- రోడ్డు, రైల్వే అనుసంధానాలపై ప్రత్యేక దృష్టి
- మంత్రివర్గ ఉపసంఘ సమీక్ష



**వేద న్యూస్, అమరావతి:**

రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ అభివృద్ధిపై రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం కీలక సమావేశం నిర్వహించింది. మంత్రి కందుల దుర్గేష్, మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొని పనుల పురోగతి, మౌలిక వసతులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పోర్ట్ తొలి దశ పనులను సమర్థవంతంగా పూర్తి చేయడానికి గడువు పొడిగింపుకు ఉపసంఘం ఆమోదం తెలిపింది. దీతో నిర్మాణ పనులు వేగవంతమై, పోర్ట్ కార్యకలాపాలు త్వరితగతిన ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. సరుకు రవాణా సౌకర్యాల మెరుగుదలకు రోడ్డు, రైల్వే అనుసంధానాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్తర దిశలో కొత్త రోడ్డు నిర్మాణం, భూసేకరణ, బడ్జెట్ అంశాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. రైల్వే డబుల్ లైన్ కనెక్టివిటీకి సంబంధించిన భూసేకరణ, ఆర్థిక ప్రణాళికలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మెరుగైన కనెక్టివిటీతో పోర్ట్ సామర్థ్యం పెరిగి, సరుకు రవాణా వేగవంతమవుతుందని అభిప్రాయపడ్డారు. పోర్ట్ అభివృద్ధితో దక్షిణ కోస్తా ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రులు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ కీలకమని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

## లిటిగేషన్ పాలసీపై మంత్రుల సమీక్ష

- కోర్టు కేసుల పరిష్కారంపై కీలక చర్చలు
- పారదర్శక పాలనకు దిశా నిర్దేశం

**వేద న్యూస్, అమరావతి:**



రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడం లక్ష్యంగా సచివాలయం బ్లాక్-2లో లిటిగేషన్ పాలసీపై మంత్రుల ఉపసంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూఖ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. సమావేశంలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల పరిష్కారంపై సుదీర్ఘంగా చర్చించారు. కేసుల విచారణలో జాప్యాన్ని తగ్గించి, సమయపాలనతో వ్యవహరించాలని మంత్రులు అధికారులకు సూచించారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపం వల్ల కేసుల నిర్వహణలో ఆలస్యం జరుగుతున్న నేపథ్యంలో సమగ్ర విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని ఆదేశించారు. లిటిగేషన్ పాలసీ ద్వారా న్యాయ వ్యవహారాల్లో పారదర్శకత, సమర్థత పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. స్పష్టమైన మార్గదర్శకాలతో కేసుల నిర్వహణలో మెరుగులు వస్తాయని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కోర్టు కేసుల సంఖ్యను తగ్గించే దిశగా ఈ పాలసీ కీలకంగా పనిచేస్తుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ పరిపాలనలో న్యాయపరమైన సంస్కరణలకు ఇది ఒక ముఖ్యమైన అడుగుగా మంత్రులు పేర్కొన్నారు.

## ప్రాణాపాయంలో చిన్నారి..



**వేద న్యూస్, హిందూపురం:**

అరుదైన ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (టైప్2)తో బాధపడుతున్న బాలుడి చికిత్సకు సుమారు రూ.16 కోట్లు అవసరమని, దాతలు ఉదారంగా స్పందించాలని ఆయన పిలుపునిచ్చారు. హిందూపురం నియోజకవర్గంలోని లేపాక్షి గ్రామానికి చెందిన కేయాన్స్ అద్విక్ (2½ సంవత్సరాలు) గత కొంతకాలంగా ఈ వ్యాధితో బాధపడుతున్నాడు. బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. చిన్నారి తల్లిదండ్రులు ఎమ్మెల్యేను కలిసి తమ ఆవేదన వ్యక్తం చేయగా, బాలకృష్ణ స్పందించి పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ వ్యాధికి చికిత్సగా "ఒనసెమ్నోజీన్ అబెపార్వోవెక్" అనే ప్రత్యేక ఇంజెక్షన్ అవసరం కాగా, అది విదేశాల నుంచి దిగుమతి చేయాల్సి ఉంటుంది. దీని ధర సుమారు రూ.16 కోట్లు కావడంతో సాధారణ కుటుంబానికి భరించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో బాలకృష్ణ తన వంతుగా ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించడంతో పాటు, ప్రభుత్వం మరియు దాతలు ముందుకు రావాలని కోరారు. ఒక్కొరి చిన్న సహాయం కూడా ఒక ప్రాణాన్ని కాపాడగలదు అంటూ ఆయన భావోద్వేగ పిలుపునిచ్చారు. ఇప్పటికే అభిమానులు, స్వచ్ఛంద సంస్థలు విరాళాల సేకరణ ప్రారంభించాయి. సహాయం చేయదలచిన వారు చిన్నారి తండ్రి ఖాతాకు విరాళాలు అందించాలని సూచించారు. అందరూ చేయి చేయి కలిపితే ఈ పసిప్రాణాన్ని కాపాడవచ్చని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# గంజాయి రవాణా కేసులో 10 ఏళ్ల జైలు

- చోడవరం కోర్టు కీలక తీర్పు - 140 కిలోల గంజాయి కేసులో ముగ్గురికి శిక్ష



**వేద న్యూస్, అనకాపల్లి:**

గంజాయి అక్రమ రవాణాపై నమోదైన కేసులో ముగ్గురు నిందితులకు చోడవరం కోర్టు కఠిన శిక్ష విధించింది. 2015లో వి.మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసులో 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం. హరి నారాయణ నిందితులకు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1 లక్ష జరిమానా విధించారు. కేసు వివరాల ప్రకారం 2015 జనవరి 10న గరికబంద చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పాడేరు నుంచి వస్తున్న టాటా సుమోను తనిఖీ చేయగా, అందులో 140 కిలోల గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాహనం, నిందితులను అదుపులోకి తీసుకుని ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో పానుగంటి సుబ్బారావు, అల్లు సత్యనారాయణ, అడిగర్ల సత్తిబాబు నిందితులుగా ఉన్నారు. పోలీసులు పకడ్బందీగా సాక్ష్యాలను సేకరించి కోర్టులో సమర్పించడంతో నేరం నిరూపితమైంది. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురుపల్లి సూర్యనారాయణ బలమైన వాదనలు వినిపించారు. కేసును సమర్థంగా దర్యాప్తు చేసిన సబ్ ఇన్‌స్పెక్టర్ జి. తేజేశ్వరరావు, వి.మాడుగుల పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు. కోర్టు మానిటరింగ్ సెల్ అధికారుల కృషిని కూడా ప్రశంసించారు. ఈ తీర్పు మత్తు పదార్థాల అక్రమ రవాణాపై కఠిన హెచ్చరికగా నిలుస్తుందని పోలీసులు తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి ఇలాంటి నేరాలను అరికట్టాలని సూచించారు.

# కాకినాడ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



**వేద న్యూస్, కాకినాడ:**

- రెండు నెలలకు ఒకసారి పర్యటనలు
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- మౌలిక వసతులపై అధికారులకు కఠిన ఆదేశాలు

కాకినాడ జిల్లా అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు ఆయన తరచూ జిల్లాలో పర్యటించాలని నిర్ణయించారు. రెండు నెలలకు ఒకసారి కాకినాడ, పిఠాపురం ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో నేరుగా మాట్లాడనున్నట్లు తెలిపారు. స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు దిశానిర్దేశం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్, ఎస్పీతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా అభివృద్ధి, మౌలిక వసతులు, ప్రజా సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం పెరిగితేనే అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందించడం ప్రాధాన్య అంశమని స్పష్టం చేశారు. జిల్లాలో రోడ్ల పరిస్థితిపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ, గుంతలు లేకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే వర్షాకాలానికి ముందే గ్రేట్ గ్రీన్ వాల్ పనులను పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# గుడివాడ టెక్కీ హర్యానాలో దారుణ హత్య

- ఉద్యోగంలో చేరిన 10 రోజుల్లోనే విషాదం
- బేతవోలు యువకుడు రుషికేష్ మృతి
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**వేద న్యూస్, గుడివాడ:**



కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బండ్ల ఋషికేష్ (27) హర్యానాలో దారుణ హత్యకు గురైన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఉద్యోగంలో చేరిన కేవలం పది రోజుల వ్యవధిలోనే ఆయన మృతి చెందడం కుటుంబ సభ్యులను, స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బేతవోలు గ్రామానికి చెందిన ఋషికేష్ ఇటీవల హర్యానాలోని పంచకుల ప్రాంతంలో ఒక ఐటీ సంస్థలో ఉద్యోగంలో చేరారు. అయితే ఆయన నివాస గదిలో రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. శరీరంపై తీవ్ర గాయాలు ఉండటంతో ఇది హత్యగా పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న హర్యానా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చేపట్టారు. హత్యకు గల కారణాలపై వివిధ కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఘటన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన హర్యానాకు చేరుకున్నారు. యువకుడి మృతితో బేతవోలు గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. నిందితులను త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం మరిన్ని వివరాలు వెలువడే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# ఢిల్లీలో దారుణం

**వేదన్యూస్, నేషనల్ డెస్క్:**

దేశ రాజధాని ఢిల్లీలో ఒక మహిళ దారుణ హత్యకు గురైన ఉదంతం కలకలం రేపింది. ఒక పేయింగ్ గెస్ట్ వసతి గృహంలో ప్రియుడితో కలిసి గదిలోకి వెళ్లిన మహిళ, కొద్దిసేపటికే శవమై కనిపించడం స్థానికంగా దిగ్భ్రాంతిని కలిగించింది. నిందితులు ఆమెను కిరాతకంగా చంపి, మృతదేహాన్ని బెడ్ బాక్స్‌లో దాచిపెట్టి పరారయ్యేందుకు ప్రయత్నించారు. అయితే, పీజీ యజమాని అప్రమత్తతతో ఈ ఘోరం వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితులను వెంబడించి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఏప్రిల్ 7వ తేదీ సాయంత్రం 4:30 గంటల సమయంలో మంగోల్‌పురి ప్రాంతంలోని ఒక పీజీ వసతి గృహానికి 35 ఏళ్ల మహిళ, 22 ఏళ్ల యువకుడు కలిసి వచ్చారు. అయితే, వారు గదిలోకి వెళ్లిన గంట వ్యవధిలోనే యువకుడు ఒంటరిగా బయటకు వెళ్లిపోతుండటాన్ని పీజీ యజమాని గమనించాడు. అతనితో పాటు వచ్చిన మహిళ కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన యజమాని, వెంటనే సిబ్బందితో కలిసి ఆ గదిని తనిఖీ చేయించాడు. గదిలో వెతకగా బెడ్ బాక్స్ లోపల మహిళ మృతదేహం లభ్యమవడంతో వారు హతాశులయ్యారు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మహిళను అత్యంత క్రూరంగా హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. బాధితురాలి చేతులు, కాళ్లు కట్టివేసి ఉన్నాయని, ఆమె గొంతు నులిమిన గుర్తులు మరియు నుదుటిపై గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు ఆమెను బంధించి, ఊపిరాడకుండా చేసి గొంతునొక్కి హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మహిళ హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫుటేజ్ ఆధారంగా నిందితుడైన 22 ఏళ్ల ప్రియుడు దీపక్ మరియు అతడికి సహకరించిన స్నేహితులు సురేందర్ అలియాస్ బాబీ, జోగిందర్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ముగ్గురూ కలిసి ఈ ప్లాన్ చేశారా? లేక మరేదైనా కారణంతో హత్య జరిగిందా? అనే కోణంలో పోలీసులు వారిని విచారిస్తున్నారు. హత్యకు గల ఖచ్చితమైన కారణాలను రాబట్టేందుకు వారిని ప్రశ్నిస్తున్నారు. హత్యకు ముందు బాధితురాలిపై లైంగిక దాడి జరిగిందా లేదా అనే విషయం పోస్ట్‌మార్టం నివేదిక ద్వారా స్పష్టమవుతుందని పోలీస్ అధికారి వెల్లడించారు. ఢిల్లీ వంటి నగరంలో పట్టపగలే ఇలాంటి దారుణాలు జరగడం మహిళా భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు నిందితులపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి విచారణ వేగవంతం చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073